ప్రమాదపుటంచున ఐఎస్ఎస్

వెంటనే అంతరిక్ష కేంద్రాన్ని ఖాళీ చేయాలి

లేకపోతే వ్యోమగాముల ప్రాణాలకే ప్రమాదం

హెచ్చరించిన బ్రిటన్ అంతరిక్ష నిపుణుడు



లండన్, నవంబర్ 1: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రమాదం పొంచి ఉందా? పెరుగుతున్న లీక్‌తో వ్యోమగాముల ప్రాణాలు ప్రమాదంలో పడనున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని లీక్‌ను గుర్తించడంలో, సరిచేయడంలో నాసా, రష్యా అంతరిక్ష సంస్థ రోస్కోమోస్ విఫలమవుతుండటం ఆందోళనకు దారి తీస్తున్నది. ఐఎస్ఎస్‌లో పెరుగుతున్న లీక్‌ను 'ప్రధాన భద్రతా ముప్పు'గా నాసా సైతం తాజాగా పేర్కొన్నది. మరోవైపు ఐఎస్ఎస్‌ను వెంటనే ఖాళీ చేయకపోతే ప్రాణాంతక విపత్తుకు దారి తీయొచ్చని బ్రిటన్‌కు చెందిన నిక్ పోప్ అనే అంతరిక్ష నిపుణుడు హెచ్చరించారు. నాసా వేచి చూసే ధోరణితో ముప్పు ముంచుకొస్తున్నదని, ఇది వ్యోమగాముల ప్రాణాలతో పాటు, నాసా ప్రతిష్ఠను సైతం అంతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

అసలు సమస్యేంటి?

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని రష్యా జ్వెజ్డ సర్వీస్ మాడ్యూల్ ట్రాన్స్‌ఫర్ టన్నెల్‌లో 2019లో ఒక లీక్‌ను వ్యోమగాములు గుర్తించారు. దీనిని అంతరిక్ష సంస్థలు పలుమార్లు మరమ్మతు చేసినప్పటికీ లీక్ కొనసాగుతూనే ఉన్నది. ఇటీవల ఇది మరింత పెరిగింది. దీంతో మొదట రోజుకు 0.09 కేజీల గాలి లీక్ అయ్యేది. ఇది ఫిబ్రవరిలో 1.08 కిలోలకు పెరిగిందని, ఏప్రిల్ నాటికి 1.68 కిలోలకు పెరిగిందని నాసా ప్రకటించింది. లీకేజీ ఇలాగే కొనసాగితే అంతరిక్ష కేంద్రం వేగంగా ఒత్తిడిని, ఆక్సిజన్‌ను కోల్పోతుంది. లీకేజీ పెరుగుతున్న నేపథ్యంలో సెప్టెంబర్‌లో ఈ సమస్యను 'ప్రధాన భద్రతా ముప్పు'గా నాసా ప్రకటించింది. అవసరమైనప్పుడు మాత్రమే లీకేజీ ఉన్న మాడ్యూల్‌కు ప్రవేశమార్గాన్ని(హాచ్) తెరవాలని, మిగతా సమయాల్లో మూసివేయాలని రోస్కోమోస్‌తో నాసా ఒక ఒప్పందానికి వచ్చింది. హాచ్ తెరిచినప్పుడు ఐఎస్ఎస్‌లోని అమెరికా వైపు ఉండాలని వ్యోమగాములకు నాసా సూచించింది. తద్వారా ఏదైనా అత్యవసర స్థితి వస్తే వ్యోమనౌకలోకి త్వరగా చేరుకోవచ్చని చెప్పింది.

వ్యోమగాములను ఎలా తెస్తుంది?

ఐఎస్ఎస్‌కు కాలం చెల్లిన నేపథ్యంలో 2031 కల్లా డీకమిషన్ చేయాలని నాసా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, నిపుణులు హెచ్చరిస్తున్నట్టుగా అత్యవసర పరిస్థితి వస్తే బోయింగ్ స్టార్‌లైనర్‌లో వెళ్లి చిక్కుకున్న ఇద్దరు సహా ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాములను నాసా వెంటనే వెనక్కు తీసుకురావాల్సి వస్తుంది. ఇందుకోసం నాసా వద్ద ప్రణాళిక ఉంది. స్పేస్‌ఎక్స్ డ్రాగన్, రష్యాకు చెందిన సుయోజ్‌తో పాటు స్పేస్ కాప్సూల్స్ ద్వారా వ్యోమగాములను వెనక్కు తీసుకురావాలి. వీటిల్లో ఎమర్జెన్సీ సూట్లు కూడా ఉన్నాయి. అయితే, అంతరిక్ష శిథిలాలు తాకి ఈ కాప్సూల్స్ విఫలమయ్యే పరిస్థితులు వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేనట్టు నాసా అంగీకరించింది. ఇది వ్యోమగాముల ప్రాణాలకు ముప్పు తేవచ్చు. కాగా, నాసా మాత్రం మరికొన్నాళ్లు వ్యోమగాములను ఐఎస్ఎస్‌లోనే ఉంచనున్నట్టు స్పష్టం చేస్తున్నది.

వాణిజ్య సిలిండర్‌పై రూ.62 పెంపు

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ పెరిగింది. ఒక్కో సిలిండర్‌పై రూ.62 పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వాణిజ్య సిలిండర్ ధరను వరుసగా నాలుగో నెల పెంచారు. తాజా పెంపుతో చెన్నైలో దీని ధర రూ.1964.50కి చేరుకుంది. గత నాలుగు నెలల కాలంలో ఈ సిలిండర్ ధర రూ.156 మేర పెరిగింది. మరోవైపు విమాన ఇంధన ధరను కూడా చమురు సంస్థలు 3.3 శాతం మేర పెంచాయి. తాజా పెంపుతో ఢిల్లీలో ఏటీఎఫ్ కిలో లీటర్ ధర రూ.90,538.72కు చేరుకుంది.

దెమ్‌చోక్‌లో భారత్ గస్తీ ప్రారంభం

భారత్, చైనా బలగాల ఉపసంహరణ పూర్తి

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని దెమ్‌చోక్ ఘర్షణ ప్రదేశం వద్ద భారత సైన్యం గస్తీ శుక్రవారం ప్రారంభమైంది. డెప్సాంగ్ వద్ద కూడా త్వరలోనే గస్తీ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ రెండు ఘర్షణ ప్రదేశాల నుంచి భారత్, చైనా దళాల ఉపసంహరణ గురువారం పూర్తయింది. దీపావళి సందర్భంగా భారత్, చైనా సైనికులు గురువారం వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి అనేక చోట్ల స్వీట్లను ఇచ్చి, పుచ్చుకున్నారు. ఈ ప్రాంతంలో 2020 ఏప్రిల్ ముందు నాటి పరిస్థితిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

చీనాబ్ వంతెనపై చైనా కన్ను

పాక్‌తో కలిసి సమాచారం సేకరణ

న్యూఢిల్లీ: చైనా ఆదేశం మేరకు ఆ దేశ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో కలిసి పాకిస్థాన్ నిఘా సంస్థ జమ్ము కశ్మీర్‌లోని చీనాబ్ వంతెనకు సంబంధించిన ముఖ్య సమాచారం సేకరిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు ఇండియా టుడేకు తెలిపాయి. ఈ వంతెన ద్వారా కల్లోలిత సరిహద్దు ప్రాంతంలో భారత్‌కు వ్యూహాత్మక అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఈ రైల్వే వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయినది.

గ్యారెంటీలతో రాష్ట్రాలు దివాలానే

- బడ్జెట్‌కు లోబడి హామీలు ప్రకటించాలి
- లేకుంటే భవిష్యత్తు తరాలు నష్టపోతాయి
- కర్ణాటకను చూసే మహారాష్ట్రకు 5 గ్యారెంటీలు
- ఇప్పుడు కర్ణాటకలోనే గ్యారెంటీలకు కోతలా?
- రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే ఎలా?
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అనాలోచితంగా ఇస్తున్న గ్యారెంటీలపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాల బడ్జెట్ ఆధారంగా కాంగ్రెస్ నాయకులు గ్యారెంటీలను ప్రకటించాలని, లేకుంటే ఈ హామీల వల్ల రాష్ట్రాలు దివాలా తీసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కర్ణాటకలో అమలవుతున్న ఉచిత బస్సు స్కీమ్‌ను (శక్తి స్కీమ్) నిలిపేయనున్నట్టు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరోక్షంగా సంకేతాలివ్వడంపై ఈ సందర్భంగా ఖర్గే మండిపడ్డారు. ఈ మేరకు గురువారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

ఖర్గే ఏమన్నారంటే??

'కర్ణాటకలో మీరు (కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం) ఐదు గ్యారెంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చారు. మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పుడు మహారాష్ట్రలో 5 గ్యారెంటీలను ప్రకటించాం. జార్ఖండ్‌లోనూ దాదాపు ఇదే విధానాన్ని పాటించాం. అయితే, ఇప్పుడు మీరు తీరిగ్గా 5 గ్యారెంటీల్లో ఒక హామీని నిలిపేస్తున్నట్టు ప్రకటించారు. మీ ప్రకటన తర్వాత దినపత్రికలను చదివారా? వాళ్లేం రాశారో చూశారా? నా అంచనా ప్రకారం మీరు పత్రికలను చదివినట్టు లేదు. అయితే, నేను అన్ని పత్రికలను చదువుతాను. అందుకే ఈ వ్యాఖ్యలు చేస్తున్నా. (మహారాష్ట్ర పార్టీ నేతలను ఉద్దేశిస్తూ..) త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 7, 8 ఇలా హామీలను పెంచుకొంటూ పోకండి. రాష్ట్రాల బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించండి. లేదంటే రాష్ట్రాలు దివాలా తీసే పరిస్థితికి చేరొచ్చు. ప్రణాళికా రహిత విధానం కారణంగా ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. (కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ..) రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే ఎలా? ఇలాగైతే ప్రభుత్వంపై ప్రజలే తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హామీల కారణంగా రాష్ట్రాలకు దివాలా తీసే పరిస్థితి రానీయవద్దని నేతలకు సూచించారు.

సీఎం సిద్ధరామయ్య కలుగజేసుకొన్నా..

మీడియా సమావేశంలో ఖర్గే ఒకింత అసహనంతో మాట్లాడుతుండగా ఇంతలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కలుగజేసుకొన్నారు. 'శక్తి స్కీమ్‌ను కేవలం సమీక్షిస్తామని మాత్రమే డీకే చెప్పారం'టూ ఖర్గేకు నచ్చజెప్పబోయారు. దీంతో స్పందించిన ఖర్గే.. 'డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యల వల్ల ఇప్పుడు ప్రతిపక్ష బీజేపీ మనల్ని నిలదీసేలా చేశాయి. అలాంటి ఛాన్స్ ప్రతిపక్షాలకు మనమెందుకు ఇవ్వాలి?' అంటూ ప్రశ్నించారు.

మాట మార్చిన డీకే

ఖర్గే చురకల నేపథ్యంలో నష్టనివారణ చర్యలకు దిగిన డీకే తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పుకొచ్చారు. ''శక్తి' స్కీమ్‌పై నా వ్యాఖ్యలను వక్రీకరించారు. ఈ స్కీమ్‌ను నిలిపివేసే ప్రసక్తే లేదు. ఈ స్కీమ్‌పై వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకొంటామని మాత్రమే నేను అన్నాను. అయితే, దీన్ని బీజేపీ నేతలు ఓ వివాదంగా మార్చారు. కర్ణాటక ప్రభుత్వ గ్యారెంటీ మాడల్‌కు నేను ఎంతో గర్వపడుతున్నా. ఈ మాడల్ దేశానికే ఆదర్శం. బీజేపీతో సహా అన్ని పార్టీలు ఈ మాడల్‌ను తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ అనుసరిస్తున్నాయి. ఇచ్చిన గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తాం. మా మాడల్‌తో కర్ణాటక ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా బుధవారం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. చాలా మంది మహిళలు తాము బస్సు టికెట్లకు డబ్బులు కడతామని చెప్తూ ప్రభుత్వానికి సోషల్ మీడియా, ఈమెయిళ్ల ద్వారా చెప్తున్నారని పేర్కొన్నారు. శక్తి స్కీమ్‌ను ఒకవిధంగా నిలిపేయనున్నట్టు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డితో త్వరలోనే సమావేశమై దీనిపై చర్చిస్తానని కూడా వెల్లడించారు. దీనిపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇప్పుడు తాను అలా అన్లేదని మాటమార్చారు. కాగా, శక్తి పథకం వల్ల ప్రభుత్వంపై ఏడాదిన్నరలో రూ.7,507.35 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ఆపేసి మహిళలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

అమలు చేయలేని హామీలతో దగా: మోదీ

అమలు చేయలేని గ్యారెంటీలను ఇస్తూ కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఖర్గే తాజా వ్యాఖ్యలతో ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో శుక్రవారం విమర్శలు గుప్పించారు. 'హామీల ప్రకటన సులభం. వాటి అమలే కష్టం. ఇప్పుడు ఆ విషయం కాంగ్రెస్‌కు తెలిసొచ్చింది. తాము ప్రకటిస్తున్న హామీలను అమలు చేయలేమని కాంగ్రెస్ నేతలకు కూడా తెలుసు. అయితే ప్రజలను మోసపుచ్చుతూ వాళ్లు ఆర్భాటపు గ్యారెంటీలను ప్రకటిస్తున్నారు. కర్ణాటకలో అభివృద్ధి మాట ఎప్పుడో మరిచిపోయారు. స్కీమ్‌లను నిలిపేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి వేతనాలు ఇచ్చే పరిస్థితే లేదు. రుణమాఫీ కోసం తెలంగాణలో రైతులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలపై దేశ ప్రజలు అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఉన్నది' అని మోదీ విమర్శించారు.

లద్దాఖ్‌లో 'అనలాగ్ మిషన్'

లేహ్‌లో ప్రారంభించిన ఇస్రో

బెంగళూరు, నవంబర్ 1: లద్దాఖ్‌లోని లేహ్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తన మొదటి అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించింది. శుక్రవారం ఈ మిషన్‌ను విజయవంతంగా ప్రారంభించినట్టు 'ఎక్స్'లో ఇస్రో ప్రకటించింది. ఆకా స్పేస్ స్టూడియో, యూనివర్సిటీ ఆఫ్ లద్దాఖ్, ఐఐటీ బాంబే, లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ మిషన్ చేపట్టాయి. గగన్‌యాన్ పేరుతో అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు ఇస్రో సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఇందుకు సన్నాహకంగా ఈ అనలాగ్ స్పేస్ మిషన్ ఉపయోగపడుతుంది. భూమి అవతల వాతావరణ పరిస్థితులు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలను వ్యోమగాములకు ఇక్కడ శిక్షణను ఇవ్వనున్నారు. సముద్ర మట్టానికి చాలా ఎత్తున ఉండే లేహ్‌లో కొంతవరకు చంద్రుడు, అంగారకుడిపై ఉండే వాతావరణ పరిస్థితులు ఉంటాయనే కారణంతో అనలాగ్ మిషన్ కోసం ఇస్రో ఈ ప్రాంతాన్ని ఎంచుకుంది.

పీఎం ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దెబ్రాయ్ కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దెబ్రాయ్ (69) ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. పేగులు పని చేయడంలో అవాంతరాలు ఏర్పడటంతో ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో గురువారం రాత్రి చేర్పించారు. ఆయన హైపర్‌టెన్షన్, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలకు సంబంధించిన సమస్యలతో కూడా బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢ సంతాపం తెలిపారు. దెబ్రాయ్ శిఖర సమానుడైన విద్యావేత్త అని కొనియాడారు. ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆధ్యాత్మికత వంటి అనేక రంగాల్లో ఆయనకు గట్టి పట్టు ఉందన్నారు. బిబేక్ దెబ్రాయ్‌కి 2015లో పద్మశ్రీ పురస్కారం లభించింది. 2019 జూన్ 5 వరకు నీతి ఆయోగ్ సభ్యునిగా ఉన్నారు. ఆయన అనేక పుస్తకాలను రచించారు. సంపాదకీయాలు, ప్రజాదరణ పొందిన వ్యాసాలను రాశారు. చాలా వార్తా పత్రికలకు కన్సల్టింగ్/కంట్రిబ్యూటింగ్ ఎడిటర్‌గా కూడా పని చేశారు.

త్వరలో జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌర స్మృతి

ఐక్యతా దినోత్సవంలో ప్రధాని

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలు త్వరలోనే సాకారమవుతాయని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. గురువారం గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద జరిగిన జాతీయ ఐక్యతా దినోత్సవంలో ప్రధాని మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల ప్రతిపాదనను శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌కు సమర్పిస్తామన్నారు. 'ఒక దేశం-ఒక ఎన్నికల దిశగా మేం పని చేస్తున్నాం. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసి, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారడంలో తోడ్పడతాయి. ఇవాళ భారత్ 'ఒక దేశం- ఒక పౌర స్మృతి' దిశగా అడుగులేస్తున్నది' అని అన్నారు.

రీప్రోగ్రామింగ్‌తో డయాబెటిస్‌కు చెక్

శరీరంలోని కొవ్వు కణాలను ఉపయోగించి వ్యాధి నయం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్న రోగులకు శుభవార్త. ఈ తరహా మధుమేహంతో బాధపడుతున్న ఓ మహిళకు రీప్రోగ్రామింగ్ టెక్నిక్ సాయంతో చైనా పరిశోధకులు ఆ వ్యాధిని పూర్తిగా నయం చేశారు. రోగి శరీరంలోని కొవ్వు కణాలను ఇన్సులిన్ ఉత్పత్తి చేసే పాంక్రియాటిక్ కణాలుగా (ఐస్‌లెట్ కణాలు) మార్చడం ద్వారా టైప్-1 డయాబెటిస్‌కు చెక్ పెట్టినట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ వివరాలను జర్నల్ 'సెల్' ప్రచురించింది. ప్రస్తుతం టైప్-1 డయాబెటిస్ నుంచి సదరు మహిళ పూర్తిగా కోలుకొన్నదని, ఈ తరహా చికిత్స కోసం మరికొంత మంది రోగులు తమ దగ్గర పేర్లు నమోదు చేసుకొంటున్నట్టు పరిశోధకులు పేర్కొన్నారు.

ఎలా చేశారంటే?

తొలుత రోగి శరీరంలోని కొవ్వు కణాల్లోకి కొన్ని ప్రత్యేక రసాయనాలను పంపించి ఫ్లూరిపోటెంట్ అనే మూల కణాలుగా (రీప్రోగ్రామింగ్ టెక్నిక్) వాటిని మార్చారు. అంటే తొలుత కొవ్వు కణాలుగా ఉండే ఆ సెల్స్ తాజా ప్రక్రియతో ఏ రకమైనా కణాలుగానైనా రూపాంతం చెందగలవన్న మాట. అనంతరం ఈ కణాలను ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ఐస్‌లెట్ సెల్స్‌గా పరిశోధకులు మార్చారు. అనంతరం మహిళ శరీరంలోకి వాటిని ప్రవేశపెట్టారు. అలా వ్యాధికి చెక్ పెట్టారు. కాగా, శరీరంలోని రోగనిరోధక శక్తి.. ఐస్‌లెట్ కణాలను నాశనం చేయడంతో ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. దీంతో టైప్-1 డయాబెటిస్ వస్తుంది.

భారత్‌ను 'విరోధి'గా పేర్కొన్న కెనడా

సైబర్ ముప్పు ఉన్నట్టు ప్రకటన

ఒట్టావా, నవంబరు 1: భారత్‌ను అధికారిక పత్రంలో మొదటిసారిగా 'విరోధి' అని కెనడా పేర్కొన్నది. కెనడా ప్రభుత్వ సంస్థ అయిన కెనడియన్ సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ గురువారం 'నేషనల్ సైబర్ థ్రెట్ అసెస్‌మెంట్ 2025-26' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో భారత్‌తో పాటు చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియాను 'దేశ విరోధులు'గా పేర్కొన్నది. భారత్ ప్రోత్సాహంతో కెనడా ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేక కార్యకలాపాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. దేశీయ సైబర్ సామర్థ్యాలతో అధునాతన సైబర్ వ్యవస్థను నిర్మించాలని భారత నాయకత్వం భావిస్తున్నదనితెలిపింది. గూఢచర్యం కోసం, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, ప్రపంచంలో భారత హోదాను పెంచుకోవడానికి, తమకు వ్యతిరేకంగా వచ్చే కథనాలను ఎదుర్కొనేందుకు ఈ సైబర్ వ్యవస్థను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నది.

ఉప్పు తగ్గిస్తే 3 లక్షల మందిని కాపాడొచ్చు!

- భారత్‌లోని ప్యాకేజ్డ్ ఆహారాల్లో సోడియం తగ్గించాలి
- డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలు పాటిస్తే జబ్బులకు దూరం
- లాన్సెట్ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడి

న్యూఢిల్లీ: ఉప్పు మనుషుల ప్రాణాలకు పెనుముప్పుగా మారుతున్నది. గుండె జబ్బు, స్ట్రోక్, మూత్రపిండాల జబ్బులకు కారణమవుతున్న ఉప్పు ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది మరణాలకు కారణమవుతున్నది. ఈ నేపథ్యంలో ఉప్పు వినియోగానికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) గత ఏడాది మార్గదర్శకాలను జారీ చేసింది. భారత్‌లోని ప్యాకేజ్డ్ ఆహార తయారీలో ఈ మార్గదర్శకాలను పాటిస్తే దశాబ్దకాలంలో మూడు లక్షల మంది ప్రాణాలను కాపాడొచ్చని, 17 లక్షల మందికి గుండె జబ్బులు రాకుండా చూడొచ్చని జార్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ అనే సంస్థ పేర్కొన్నది. భారత్‌లో ఉప్పు వినియోగంపై ఈ సంస్థ చేసిన అధ్యయన వివరాలు లాన్సెట్ పబ్లిక్ హెల్త్ అనే ప్రఖ్యాత జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆరు వేల కోట్లు ఆదా చేయొచ్చు

గుండెజబ్బులను నివారించేందుకు ఒక మనిషి ఒక రోజుకు ఐదు గ్రాముల కంటే తక్కువ ఉప్పు(దాదాపు 2 గ్రాముల సోడియం) తీసుకోవాలని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొన్నది. ప్యాకేజ్డ్ ఆహారాల్లో సోడియం ఎక్కువగా ఉంటున్నదని ఈ అధ్యయనం పేర్కొన్నది.వినియోగదారులకు ఒకసారి ఉప్పు ఎక్కువగా ఉండే ప్యాకేజ్డ్ ఆహారాలు అలవాటు అయితే తగ్గించడం కష్టమని, కాబట్టి వెంటనే వీటిల్లో సోడియం వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించింది. భారత్‌లో ప్యాకేజ్డ్ ఆహారంలో డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల మేరకు సోడియంను వినియోగిస్తే దశాబ్దకాలంలో మూడు లక్షల మరణాలు, 17 లక్షల గుండె జబ్బులు, ఏడు లక్షల మూత్రపిండాల జబ్బులు రాకుండా నివారించొచ్చని, దీర్ఘకాలిక జబ్బుల కోసం వైద్యసేవలకు అయ్యే రూ.6,730 కోట్లను ఆదా చేయొచ్చని అంచనా వేసింది.

34 వేల మంది ఉద్యోగులకు జీతాలు నిలిపివేత

యూపీ ప్రభుత్వ చర్యలు

లక్నో, నవంబర్ 1: ప్రభుత్వ ఉద్యోగులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం షాకిచ్చింది. తమ స్థిర, చరాస్తులను వెల్లడించని ఉద్యోగుల వేతనాలను నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ ఆస్తుల వివరాలను మానవ్ సంపద అనే పోర్టల్‌లో పొందుపర్చాలని యూపీ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ ఇంకా 34,459 మంది ఉద్యోగులు ఆస్తులను వెల్లడించలేదు. ఉద్యోగులందరికీ దీపావళి పండుగకు ముందే యూపీ ప్రభుత్వం వేతనాలు జమ చేసినప్పటికీ వీరికి మాత్రం నిలిపివేసింది.

చాట్‌జీపీటీలో సెర్చ్ ఫీచర్

గూగుల్ సెర్చ్ ఇంజిన్‌కు పోటీగా తెచ్చిన ఓపెన్‌ఏఐ



శాన్‌ఫ్రాన్సిస్కో: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న 'ఓపెన్ ఏఐ' సంస్థ తన జనరేటివ్ ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ'లో సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. గూగుల్‌కు పోటీగా సెర్చ్ ఫంక్షన్‌ను జోడించింది. 'చాట్‌జీపీటీ సెర్చ్' అని పిలిచే ఈ కొత్త ఫీచర్‌తో ఓపెన్‌ఏఐ నేరుగా గూగుల్ సెర్చ్ ఇంజిన్‌కు పోటీ ఇవ్వనున్నది. ప్రస్తుతం చాట్‌జీపీటీ పెయిడ్ యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ కొత్త ఫీచర్‌ను క్రమంగా చాట్‌జీపీటీ వినియోగదారులందరికీ అందుబాటులోకి తెస్తామని 'ఓపెన్‌ఏఐ' ప్రకటించింది. 'జీపీటీ-4ఓ' ఫైన్-ట్యూన్డ్ వెర్షన్ అయిన ఈ సెర్చ్ మాడల్‌ను చాట్‌జీపీటీ ప్లస్, టీమ్ వినియోగదారులంతా గురువారం నుంచి యాక్సెస్ చేయగలుగుతున్నట్టు వెల్లడించింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా వినియోగదారులు ఇకపై వెబ్‌లింక్స్‌తో కూడిన రియల్-టైమ్ సమాచారాన్ని తక్షణమే పొందవచ్చని, గతంలో మాదిరిగా సెర్చ్ ఇంజిన్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండబోదని వివరించింది. వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు 'చాట్‌జీపీటీ సెర్చ్' తన భాగస్వాములు నేరుగా అందించే కంటెంట్‌తోపాటు థర్డ్ పార్టీ సెర్చ్ ప్రొవైడర్ల సేవలను ఉపయోగించుకుంటున్నట్టు ఓపెన్‌ఏఐ ఓ బ్లాగ్ పోస్టులో పేర్కొన్నది.

కంపు కొట్టే టాయ్‌లెట్.. రైల్వేకు జరిమానా

విశాఖ ప్రయాణికుడికి 30 వేలు చెల్లించాలని వినియోగదారుల కోర్టు ఆదేశం

*విశాఖపట్నం: రైలులో టాయ్‌లెట్, ఏసీ సదుపాయాలు లేకపోవడంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడిన ప్రయాణికునికి రూ.30 వేలు చెల్లించాలని ఇండియన్ రైల్వేను విశాఖపట్నం వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 ఆదేశించింది. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని హామీ ఇచ్చి, టికెట్ సొమ్మును వసూలు చేసినందువల్ల కనీస మౌలిక సదుపాయాలను కల్పించవలసిన బాధ్యత రైల్వేలకు ఉందని చెప్పింది. సదుపాయాల గురించి ముందుగా తనిఖీ చేయకుండా రైళ్లను నడుపుతున్నారని వ్యాఖ్యానించింది. బాధితుడు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి దువ్వాడ వెళ్లేందుకు తనకు, తన కుటుంబ సభ్యులకు 4 థర్డ్ ఏసీ టికెట్లను తీసుకున్నారు.